## క్లుప్తంగా

### కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నేరడిగొండ: ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో చేపట్టిన సర్వేను ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటింటికీ వెళ్లి పంచాయతీ సిబ్బంది పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.

### అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం

ఇచ్చోడ: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని అగ్నిమాపక సిబ్బంది అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫస్ట్‌స్టెప్ స్కూల్‌లో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో అగ్నిప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అనురాజ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బిల్‌కిస్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలో ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలతో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.
బోథ్: బజార్‌హత్నూర్ మండలంలో 33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు శనివారం సొనాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్, రణదీవెనగర్, సుందరయ్యనగర్, నీలానగర్, గాంధీనగర్, ఇందిరానగర్, డాల్డా కంపెనీ ఏరియా, హరి ఓంనగర్, రాంపూర్ ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నమ్రత ఒక ప్రకటనలో తెలిపారు.

### యువత అన్నిరంగాల్లో రాణించాలి


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న రితేష్ రాథోడ్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత అన్నిరంగాల్లో రాణించాలని బీజేపీ ఖానాపూర్ ఇన్‌చార్జి రితేష్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ రాథోడ్ రమేశ్ స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, కనక తుకారం, రాథోడ్ రాధిక, రాథోడ్ భీంరావ్, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, సుధీర్, మెస్రం జైరాం పాల్గొన్నారు.

### పశువుల పాక పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో ఉపాధిహామీ పథకం నిధులతో పశువుల పాక నిర్మాణం పనులు ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధులతో పశువుల పాక నిర్మాణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కామాగిరిలో నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, క్షేత్ర సహాయకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా బండారా

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామపంచాయతీ పరిధిలోని దాబాడి గ్రామంలో శుక్రవారం మధుర సమాజం ఆధ్వర్యంలో బండారా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూరి జగన్నాథ్ స్వామి పూజ, మహా అన్నదానం, సామూహిక నైవేద్య ప్రసాదం నిర్వహించారు. యువకులు, మహిళలు చేసిన దాండియా నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అజ్జే నారాయణసింగ్, నానక్‌సింగ్, జగ్దేరావ్, విఠల్, చందర్‌సింగ్, ఇంద్రజిత్, కార్తర్‌సింగ్, అమర్‌సింగ్ బోపాల్, కబీర్‌సింగ్, రిసింగ్, ఆనందరావ్ పాల్గొన్నారు.

# సబ్సిడీపై పరికరాలు..!

- మళ్లీ అమలుకానున్న 'యంత్రలక్ష్మి'
- ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో ఆశలు

సిరికొండ: గతంలో ప్రభుత్వాలు రైతులకు యంత్ర లక్ష్మి పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేసేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యంత్రలక్ష్మి పథకానికి మంగళం పాడింది. మళ్లీ వ్యవసాయ పరికరాలు అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు ఆశలు చిగురించాయి. స్ప్రింక్లర్లు, పనిముట్లకు లక్షల్లో ఖర్చు అయ్యేవి. వాటిని కొనుగోలు చేసే స్తోమత రైతులకు లేకపోవడంతో పంట సాగు సరిచేయక ఆర్థికంగా నష్టపోతున్నారు.

**ఆర్థికం భారం తగ్గి..**

వ్యవసాయ పరికరాలు అయిన పైపులు, స్ప్రింక్లర్లు, పంపులను సబ్సిడీపై అందజేస్తే రాష్ట్రంలో పంటల సాగు గణనీయంగా పెరుగుతుంది. కొంతమంది రైతన్నలకు వ్యవసాయ భూమి ఉన్న వారికి రబీ సాగుకు సరైన నీటి సౌకర్యం లేక పంటల సాగుకు దూరం అవుతున్నారు. లక్షలు ఖర్చు చేసి పరికరాలను కొనుగోలు చేసే స్తోమత లేక రైతన్నలు ఆర్థికంగా వెనుకబడి పోతున్నారు. రబీ పంటలు సాగు చేయక విలువైన భూములను అలాగే వ్యవసాయం చేయకుండా వదిలేస్తున్నారు. వ్యవసాయ పరికరాలు మళ్లీ పంపిణీ చేస్తే రైతన్నలకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా పంటల దిగుబడి కూడా పెరుగుతుందని అన్నదాతలు ఆశలు పెట్టుకుంటున్నారు.


స్ప్రింక్లర్ల ద్వారా పంటల సాగు

**వెంటనే అమలు చేయాలి..**

సబ్సిడీ పరికరాలు రైతన్నలకు అందజేసే పథకంను వెంటనే పారంభించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు సబ్సిడీ పథకం ద్వారా వచ్చే వ్యవసాయ పరికరాలతో వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా నీటి పారుదల పెరిగి రబీ పంటల్లో కూరగాయలు, వాణిజ్య పంటలు పండించవచ్చు.

### పరికరాలు అందజేయాలి



నాకున్న 2 ఎకరాల వ్యవసాయ భూమితో పాటుగా 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాం. 20 ఎకరాల భూమిలో రబీ పంటలను వేశాం. నీటి పారుద కోసం చేనుకు దూరంలో ఉన్న వాగు నుంచి నీటిని చేనులోకి పారించాలంటే పైపులు స్పింకర్లు అవసరం ఉంటుంది. ప్రభుత్వం వెంటనే సబ్సీడీపై పరికరాలు అందజేయాలి.
– హస్సన్, రైతు, సిరికొండ

### కొనుగోలు చేసే స్థోమత లేదు

వ్యవసాయ చేనులో బావి ఉంది. నీరు కూడా పుష్కలంగా ఉన్న పైపులు లేక 8 ఎకరాల వ్యవసాయ భూమిని కేవలం వర్షంపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నాను. పైపులు, స్ప్రింక్లర్లు కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేదు. సబ్సిడీ ద్వారా వ్యవసాయ పరికరాలు అందజేస్తే అనేక పంటలు పండిస్తాను.
– ఆత్రం సుదర్శన్, రైతు, రిమ్మ

# నిరసన ర్యాలీ విజయవంతం చేయండి


వివరాలు వెల్లడిస్తున్న కమిటీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 22న శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు అగ్గిమల్ల గణేష్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీలు, కుల, మతాల కతీతంగా హాజరైన నాయకులు అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.
ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. మేధావులు, ఉద్యోగులు, విద్యావంతులు పార్టీలకతీతంగా ఏకతాటిపైకి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు రత్నపురం రమేశ్, దాండిగే సందీప్, నిమ్మల ప్రశాంత్, భూమన్న, నవీన్ కుమార్, దయాకర్, నజీర్, జహీర్ రంజాని, రత్నజాడే ప్రజ్ఞకుమార్, గణేష్ మెకానే, మనోజ్, ప్రసన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్


వంటలు రుచి చూస్తున్న మాజీ జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి

తలమడుగు: మండలంలోని ఖోడద్ గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలంగాణ వంటకాల ఆనంద మేళా (ఫుడ్ ఫెస్టివల్) కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు తయారుచేసిన రుచికరమైన వంటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల కోసం కంప్యూటర్లకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బదిలీలు పదిన్నతులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచులు సాకె ఆనంద్, పురుషోత్తం, ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ అధికారి చిన్నయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఇంధన పొదుపు పాటిద్దాం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఇంధన పొదుపును పాటిద్దామని ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ జూనియర్ మేనేజర్ శ్రీమన్నారాయణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ముత్నూర గ్రామంలో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరం లేని సమయంలో విద్యుత్ వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, తుంరం మారుతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# 'సహకార' రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: రైతులు సహకార సంఘం రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి హాజరై మాట్లాడారు. సంఘం ఆదాయంతో పాటు నిధుల వివరాలను సీఈవో కేశవ్ సభ్యులు ముందు చదివి వినిపించారు. పంట రుణాలతో పాటు తక్కువ వడ్డీకే ఇళ్లు, వాహనాల కొనుగోలు కోసం రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. తాంసి సహకార సంఘం ద్వారా రైతుల కోసం గిరిగాం, అర్లి(టి), అంతర్గాం గ్రామాల్లో గోదాం నిర్మాణాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, డైరెక్టర్లు అశోక్ రెడ్డి, చంద్రన్న, కవిత పాల్గొన్నారు.

# టీయూసీఐ నాయకులను విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎదులాపురం: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మిక సంఘాల జేఏసీ శుక్రవారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో అరెస్ట్ అయిన టీయూసీఐ నాయకులను వెంటనే విడుదల చేయాలని ట్రేడ్ యూనియన్ సెంట్రల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి రాజన్న, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ తరలివెళ్తున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు దళిత్, ఉమ్మడి జిల్లాలోని ఆటో డ్రైవర్లను, కార్మిక సంఘాల నాయకులను గురువారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులకు పూట గడవని పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


గణిత ప్రయోగ దీపికలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

బోథ్: మండల కేంద్రంలోని వేదం పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో రమేశ్, ఎంఈవో కుమ్మరి పోశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణితం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత ఆకృతులు, ప్రయోగ దీపికలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

### కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన జేఏసీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల ఐకేపీ వీవోఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ని మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాలెకర్ ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రామన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశన్న, ఉపాధ్యక్షుడిగా సంతోష్, లలిత, కె.మమత, కార్యదర్శిగా సవితా, సహాయ కార్యదర్శులుగా రామారావు, స్వప్నలను ఎన్నుకున్నారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి స్మైల్ సొసైటీ సభ్యులు మానవత్వాన్ని చాటారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాందా(టి) బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి సంబంధికులు ఎవరూ రాకపోవడంతో ఎస్సై ముజాహిద్ స్మైల్ సొసైటీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ముందుకొచ్చి శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో మృతదేహానికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు కేమ శ్రీకాంత్, భూరె సురేశ్, రవికాంత్ యాదవ్, కిరణ్, రామకృష్ణ, సాయి గౌడ్, నజీర్ పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో శుక్రవారం మన పల్లె స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద గ్రంథాలయానికి రూ. 15 వేల విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలు సంస్థ అధ్యక్షుడు బద్దం నర్సింగ్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం గ్రంథాలయ సభ్యులు శాలువతో సన్మానించారు. గ్రంథాలయాలు భావి ఉద్యోగులను తయారుచేసే ప్రయోగశాల అన్నారు. ప్రతిఒక్కరూ తమ వంతుగా గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాల వికాస కోఆర్డినేటర్ ప్రసూన్ రెడ్డి, కారోబార్ సంజీవ్ రెడ్డి, గౌనేల గంగన్న, గ్రంథాలయ సభులు చైతన్య, మహేశ్, నరేశ్, కల్యాణ్, వికాస్ పాల్గొన్నారు.

# అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మావల మండలంలోని బట్టిసావర్ గాం శివారులోని కుమరం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో స్టార్ జాగృతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడిన విధానాన్ని నిరసిస్తూ.. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
నేరడిగొండ: అమిత్‌షా దేశ ప్రజలకు క్షమపణ చెప్పాలని అంబేడ్కర్ యువజన సంఘం, కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌక్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఎదులాపురం: కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఎదుట సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దిష్టి బొమ్మ దహనం చేశారు.
ఎదులాపురం: జిల్లా కేంద్రంలో భీం ఆర్మీ ఆజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హోం మంత్రి అమిత్ షా కు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.
బజార్‌హత్నూర్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని ధర్మసమాజ్ మండల అధ్యక్షుడు సర్కిల్ నరేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రోడ్డుపై నిరసన తెలిపారు.
బోథ్: దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: పాముకాటుకు గురైన తలమడుగు మండలం ఖరంపూర్ గ్రామానికి చెందిన ఆకాష్‌తో పాటు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఝరి గ్రామానికి చెందిన అశోక్ రెడ్డిలను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం అక్కడికి చేరుకొని వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మహేశ్‌యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, మాడూరి వినయ్, ఉల్వాని అభిలాష్ ఉన్నారు.
ఆదిలాబాద్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఏఎస్సై సిరాజ్ ఖాన్ తండ్రి మహమ్మద్ హుస్సేన్ ఖాన్ ఇటీవల మృతిచెందగా శుక్రవారం విద్యానగర్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం భుక్తాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యకర్త వాజిద్ కుటుంబాన్ని పరామర్శించారు. చిల్కూరిలక్ష్మీనగర్‌కు చెందిన జిలాని కూతురు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

### 'డయల్ యువర్ డీఎం'కు స్పందన కరువు

ఆదిలాబాద్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన కరువైంది. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి కేవలం ఇద్దరు ప్రయాణికులు మాత్రమే కాల్ చేయడం గమనార్హం. సోనాల మండల కేంద్రం నుంచి కత్తి గంగాధర్ అనే ప్రయాణికుడు కాల్ చేసి ఇచ్చోడ నుంచి సొనాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరాడు. సంధ్య అనే ప్రయాణికురాలు ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు సెమి డీలక్స్ బస్సు నడిపించాలని కోరగా, డీఎం స్పందిస్తూ ఉదయం 7.30 గంటలకు బస్సు సౌకర్యం ఉందని, 8 నుంచి 9 గంటలకు బస్సు సౌకర్యం గురించిపై అధికారులకు తెలియజేసి, వారి ఆదేశానుసారం నిర్ణయం తీసుకుంటామన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

బోథ్: తమ డిమాండ్లను పరిష్కరించాలని, తమకు రావాల్సిన జీతభత్యాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే గ్రామాలను శుభ్రం చేసే తమకు ప్రభుత్వం న్యాయం చేయడం లేదని వాపోయారు. వెంటనే తమ జీతాలు చెల్లించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో యోగా తప్పనిసరి


యోగాసనాలు చేయిస్తున్న యోగిత

బోథ్: నిత్య జీవితంలో యోగా తప్పనిసరి అని యోగా శిక్షకురాలు మునిగెల యోగిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి, వారితో యోగాసనాలు వేయించారు. ప్రతీరోజు ఉదయం యోగా చేస్తే మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. చదువే సమయంలో ఏకాగ్రత కోసం యోగా చేయాలన్నారు. అధికంగా ఫోన్‌లతో గడపడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మానసిక ప్రశాంతత కోసం యోగా చేయడం ఎంతో ముఖ్యమన్నారు.

### బ్రహ్మోత్సవాలు ప్రారంభం


కుంకమార్చన నిర్వహిస్తున్న మహిళలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు మహాభిషేకం, ఉదయం 9.30 గంటలకు అమ్మపాదుకలతో పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు.

### 23 నుంచి చండీ యాగం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాంద(టి) గ్రామంలో ఈనెల 23, 24 తేదీల్లో శ్రీనవ చండీ మహాయాగం నిర్వహిస్తున్నట్లు మహాలక్ష్మి చారిటబల్ ట్రస్ట్ చైర్మన్ ఆరే వైష్ణవి ప్రకటనలో తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ యాగం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని యాగాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### 'కేటీఆర్‌పై కేసు పెట్టడం అప్రజాస్వామికం'

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

### క్రిస్మస్ వేడుకలు విజయవంతం చేయండి

ఆదిలాబాద్: ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా ఈనెల శనివారం సాయంత్రం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో గార్డెన్‌లో నిర్వహించే క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని క్రిస్మస్ నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్, జనరల్ సెక్రటరీ బి.జయంత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.